



# కరపత్రం

SINCE 2014

మంగళవారం అక్టోబర్ 22 2024 | సంపుటి :0 | సంచిక : 14 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

## ఉక్రెయిన్ యుద్ధంలో భారత్ మధ్యవర్తిత్వం చేయగలదు కానీ..: యూకే మాజీ ప్రధాని కామెరూన్



రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేలా మధ్యవర్తిత్వం చేసే శక్తి భారత్‌కు ఉందని.. కానీ, కొన్ని అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని యూకే మాజీ ప్రధాని కామెరూన్

“మా దేశంలో ప్రధాన మంత్రి లేదా పార్టీ నాయకుడు 4,000 మందితో మాట్లాడితే చాలా అదృష్టంగా భావిస్తాం.

యూకేకు తొలి మహిళా ప్రధానిని అందించిన కన్జర్వేటివ్ పార్టీనే.. దేశానికి బ్రిటిష్-ఇండియన్ ప్రధానిని కూడా ఇస్తుందని చెప్పాను.

16వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ త్వరలో మాస్కోలో పర్యటించనున్నారు.

2 లో

## ఉగ్రవాదంపై యుద్ధం ఇంకా ముగియలేదు: అమిత్ షా

- దిల్లీలో జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే తమ లక్ష్యమన్నారు.
- స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దేశాన్ని రక్షించడానికి 36,468 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని.




- 1959లో లడఖ్‌లో చైనా సైనికులు జరిపిన ఆకస్మిక దాడిలో మరణించిన పోలీసులు, ఇతర అధికారుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

2 లో

# అమరులైన కానిస్టేబుల్, ఏఎస్సై కుటుంబాలకు రూ.కోటి పరిహారం

- శాంతి భద్రతలు, నిఘా విషయంలో తెలంగాణ పోలీసుల పాత్ర కీలకమని సీఎం రేవంత్‌రెడ్డి
- అమరులైన కానిస్టేబుల్, ఏఎస్సై కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.
- అమరులైన ఎస్సై, సీఐ కుటుంబాలకు రూ.కోటి 25 లక్షలు.. డీఎస్పీ, ఏఎస్పీ కుటుంబాలకు రూ.కోటి 50 లక్షలు..
- ఎస్పీ, ఐపీఎస్ కుటుంబాలకు రూ.2 కోట్ల పరిహారం ఇస్తామన్నారు. శాశ్వత అంగవైకల్యం పొందిన పోలీసులకు పరిహారం ఇస్తామని ప్రకటించారు.
- అమర వీరులను స్మరించుకోవడం మన బాధ్యత: డీజీపీ జితేందర్
- దేశ వ్యాప్తంగా ఈ ఏడాది 214 మంది పోలీసులు అమరులయ్యారని చెప్పారు.





హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ భద్రత, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిదన్నారు. అమరులైన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. విధి నిర్వహణలో మరణించిన అధికారులను గుర్తు చేసుకోవడం అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు.

“పోలీసు సిబ్బంది పట్ల నాకు ప్రత్యేక అభిమానం ఉంది. పోలీసులు, వారి కుటుంబాలు ఆత్మగౌరవంతో జీవించాలి. ఎవరి ముందో చేయి చాచే పరిస్థితి తెచ్చుకోవద్దని కోరుతున్నా. విమర్శలకు అవకాశం ఇవ్వొద్దని కోరుతున్నా. విధి నిర్వహణలో పోలీసులకు ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకుంటాం. .

## గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ



2 లో

**14 ఏళ్ల తర్వాత గ్రూప్-1 పరీక్ష జరుగుతోందని అభ్యర్థుల తరఫు న్యాయవాది తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో 29 తెచ్చిందని తెలిపారు.**

**పరీక్షపై హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని రాష్ట్ర ప్రభుత్వ తరఫు న్యాయవాది చెప్పారు.**

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 రద్దు చేయాలని కోరుతూ గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. తీర్పు వచ్చే వరకు పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. జీవో 55నే అమలు చేయాలని కోరినా సీఎం పట్టించుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు.దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరి 8న జారీ చేసిన జీవో 29ని రద్దు చేయాలని గ్రూప్-1 అభ్యర్థులు కోరుతున్నారు. జనరల్ కేటగిరీలోని అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారిని అన్‌రిజర్వ్‌డుగానే పరిగణిస్తుండటం వల్ల దివ్యాంగ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. వారికంటే ఎక్కువ మార్కులు వచ్చినా..

## దారి తప్పిన సెక్యులరిజం

### సెక్యులరిజం అంటే హిందూ వ్యతిరేకతనే!




శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్..

**సెక్యులరిజం ఒకప్పుడు అర్థం కాని బ్రహ్మ పదార్థంగా ఉండేది. ఇప్పుడు సెక్యులరిజం అంటే హిందూ వ్యతిరేకం అని సామాన్యులకు కూడా తెలిసిపోయింది. సెక్యులరిజం ఆవిరావం పాశ్చాత్య దేశాలలో జరిగింది. అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగ తొలి సవరణ రాజ్యాన్నీ, చర్చ్‌నీ వేరు చేయడం గురించే.**

ఇక్కడ ఒక విషయం గుర్తు చేసుకోవాలి. అమెరికా రాజ్యాంగ నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన థామస్ జఫర్సన్ జాన్ లాక్ ఒక ఆరాధకుడు. మత వ్యవస్థకు సంబంధించి, పౌరులు మతాన్ని అనుసరించడాన్ని నిరోధించడం పైన అమెరికా కాంగ్రెస్ ఎలాంటి చట్టాలు చేయదు. దీని అర్థం మతం గురించి మరచిపొమ్మని కానేకాదు.

2 లో

## అర్థరహిత ఆలోచనలతో పారిశ్రామిక రంగానికి దెబ్బ: కేటీఆర్



- విద్యుత్ అనేది రాష్ట్ర అభివృద్ధితో ముడిపడిన అంశమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్
- ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌ను కలిసినట్లు చెప్పారు.
- 300 యూనిట్లు దాటితే ప్రస్తుతం యూనిట్‌కు రూ.10 ఫిక్స్‌డ్ ఛార్జీ వసూలు చేస్తున్నారని, ఆ పరిధి దాటితే ప్రస్తుతం ఉన్నదానికంటే 5 రెట్లు పెంచాలని ప్రభుత్వం ప్రతిపాదించిందని అన్నారు.
- ఈ ప్రతిపాదనను తిరస్కరించాలని ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌ను కోరినట్లు తెలిపారు.
- గతంలో ట్రూ అప్ ఛార్జీలు రూ.12,500 కోట్లు పెంచాలని విద్యుత్ సంస్థలు కోరాయి.

## సియోల్‌లో మాపో రిసోర్స్ రికవరీ ప్లాంట్‌ను సందర్శించిన తెలంగాణ మంత్రుల బృందం



2 లో

## ఉక్రెయిన్ యుద్ధంలో భారత్ మధ్యవర్తిత్వం చేయగలదు కానీ..: యూకే మాజీ ప్రధాని కామెరూన్

మొదటి పేజీ తరువాయి

ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో మధ్యవర్తిత్వం చేయగల శక్తి భారత్‌కు ఉందని యూకే మాజీ ప్రధాని డేవిడ్ కామెరూన్ పేర్కొన్నారు. ప్రస్తుత సంక్షోభ తీవ్రతను ఈ చర్య తగ్గించగలదని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్డీటీవీ ప్రపంచ సదస్సు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, ఉక్రెయిన్ భూభాగాలను రష్యా విలీనం చేసుకోకుండా చూడాల్సి ఉంటుందన్నారు.అదే సమయంలో 2015లో మోదీతో లండన్‌లోని వెంబ్లీ స్టేడియంలో జరిగిన ఓ ఘటనను కూడా ఆయన గుర్తుకు తెచ్చుకొన్నారు. కానీ, ఓ ప్రత్యేక సందర్భంలో వెంబ్లీ స్టేడియంలో ప్రధాని మోదీ ఏకంగా 85,000 మందిని ఉద్దేశించి ప్రసంగించారు. ఆ సదస్సులో నేను మాట్లాడుతూ.. నాడు అక్కడే వెనుక వరుసలో కూర్చొన్న కుర్రాడు రిషి సునాక్ ప్రధాని అవుతారని నాకు తెలియదు" అని అన్నారు.యుద్ధంపై ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ శుక్రవారం స్పందించారు. ఈ సంక్షోభం ఎప్పుడు ముగుస్తుందో కచ్చితంగా చెప్పలేమన్నారు. అదే సమయంలో రష్యా యుద్ధంలో విజయం సాధిస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బ్రిక్స్ పశ్చిమ దేశాలకు వ్యతిరేక గ్రూప్ కాదని.. పశ్చిమ దేశాలు లేని గ్రూపని మోదీ చేసిన వ్యాఖ్యలను పుతిన్ సమర్థించారు. రష్యా అధ్యక్షతన కజన్ వేదికగా ఈ నెల 22 నుంచి 24 వరకు 16వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ సందర్భంగా సభ్య దేశాల అధినేతలతో భారత ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఏడాది వ్యవధిలో మోదీ రష్యాలో పర్యటించడం ఇది రెండో సారి.

## గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు కూడా నిరాకరించింది. హైకోర్టు తన మధ్యంతర ఉత్తర్వుల్లో అన్ని అంశాలూ స్పష్టంగా చెప్పిందని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. అభ్యర్థులు పరీక్షా కేంద్రాల్లో ఉన్నప్పుడు జోక్యం చేసుకోవడం సరికాదని పేర్కొంది. ఫలితాల విడుదలకు ముందే తుది విచారణ ముగించాలని హైకోర్టుకు సూచించింది.వాదనల సందర్భంగా.. ఇరువర్గాల వాదనలు విన్న సుప్రీంకోర్టు గ్రూప్-1 పరీక్ష నిలుపుదల కుదరదని తేల్చి చెప్పింది.రిజర్వేషన్ కేటగిరీగానే పరిగణించి 1:50 కింద అభ్యర్థులను మెయిన్స్‌కు పిలవాలని కోరుతున్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించిన వివాదం నేపథ్యంలో గ్రూప్-1 పరీక్షలు నిలిపివేయాలని కొందరు అభ్యర్థులు కోరగా.. హైకోర్టు నిరాకరించింది. నోటిఫికేషన్ రద్దు చేయాలన్న అభ్యర్థనను తిరస్కరించిన ఉన్నత న్యాయస్థానం.. నియామకాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని విచారణ వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## దారి తప్పిన సెక్యులరిజం

మొదటి పేజీ తరువాయి

ఈ సూర్తిని అమెరికా అధ్యక్షులు అందరూ ఆచరణలో చూపారు. కెన్నడీ, ఒబామా, బైడెన్ ల పదవీ ప్రమాణ స్వీకారం వారి కుటుంబ వారసత్వంగా వస్తున్న బైబిల్ మీద చేశారు.సెక్యులర్ భావాన్ని చర్చ్‌కీ, రాజ్యానికీ మధ్య గోడ నిర్మాణం అనే అభివరి?ంచాడు జఫర్సన్. అక్కడ ఎక్కువ మంది బైబిల్ మీద పదవీ ప్రమాణం చేస్తారు. ఇంగ్లండ్‌లోనూ అంతే. సెక్యులరిస్టు దేశానికి నాయకత్వం వహిస్తున్నా, వ్యక్తిగత విశ్వాసాలను దాచుకోనవసరం లేదనే ఇక్కడ అర్థం.ఫ్రెంచ్ విప్లవానికి ముందు రాజ్యంలో మత గురువుల ప్రమేయం లేదా చర్చ్ చొరబాటు పరమ జుగుప్సాకరంగా, అమానుషంగా ఉండేది. 1789 నాటి ఫ్రెంచ్ విప్లవానికి బీజాలు వేసిన వాటిలో ఇదీ ఒక అంశమే. నాడు దీనిని ఫస్ట్ ఎస్టేట్ అనేవారు. ఇందులో 1,30,000 మంది సభ్యులుండేవారు. వీళ్ల ప్రత్యేక హక్కులకు హద్దే లేదు. అంటే పాలకుల పక్కన స్థానం. దేశంలోని భూభాగంలో 10 శాతం చర్చ్ అధీనంలో ఉండేది. దీనికి పన్ను లేదు. వారి భూముల సాగు బాధ్యత పేదరైతులదే. పౌరులంతా చర్చ్ సుంకం కట్టాలి. ప్రతిదానికి పాపపరిహార పత్రాలు చర్చ్ నుంచి కొనుగోలు చేయాలి. ఇందుకు పెద్ద ఎత్తున ధనం వెచ్చించాలి. విప్లవకారులు దీనిని రద్దు చేశారు.ఇదే ఫ్రెంచ్ విప్లవం.విప్లవం తరువాత చక్రవర్తి అయిన నెపోలియన్ బోనాపార్టీ కూడా చర్చ్‌కీ, రాజ్యానికీ మధ్య బంధాన్ని తెగ్గొట్టాడు. చాలా చిత్రమైన అంశం ఏమిటంటే ఒకప్పుడు ఇస్లాంకు ప్రపంచ గురుపీఠం టర్కీ. 1923లో ముస్తాఫా కెమాల్ పాషా టర్కీలో సెక్యులరిజాన్ని ప్రవేశపెట్టాడు. ఆయనకు సూర్తి ఫ్రాన్స్ పరిణామాలే. టర్కీలో ఇస్లాం అధికార మతంగా ఉండేడి.ఇస్లాం ను రాజ్యమత స్థానం నుంచి ముస్తాఫా నిర్దాక్షిణ్యంగా నెట్టేశాడు.భారత దేశంలో ఎప్పుడూ మాట రాజ్యాలు లేవు.మతం ఎప్పుడూ పాలనలో లేదు.అనాదిగా భారత్ సహజ సహన భావాన్ని కలిగివున్న వ్యవస్థ.

నవీన భావాల వాదనతో సెక్యులరిజం, ఉదారవాదం, ప్రజాస్వామ్యం అనే ఆలోచనా దోరణులు ప్రచారంలోకి వచ్చాయి. ఈ మూడింటి మధ్య అవినాభావ సంబంధం ఉంది. ఈ మూడు ధోరణులు పరస్పర ఆధారాలు. కానీ ఆ మూడు భావాల సాయంతోనే, ఆ మూడింటినీ మట్టు పెట్టడానికి ఈ భారతదేశంలోనే కాకుండా, ప్రపంచమంతా ఒక బహిరంగ కుట్ర జరుగుతున్నది. ముస్లిం తీవ్రవాదం దీని వెనుక ఉన్నది. ఈ వాస్తవాన్ని ముస్లిం ఫండమెంటలిజం దాచుకోవడం లేదు. కానీ బుజ్జగింపు రాజకీయాలకు అలవాటు పడిన భారత రాజకీయ పార్టీలు, నాయకులు మాత్రం దీనిని గుర్తించేందుకు గుడ్డిగా నిరాకరిస్తున్నారు. ఇప్పుడు ప్రపంచంలోని అత్యంత మేధా దివాలాకోరుతనం కూడా ఇదే. సెక్యులరిజం అనే ఒక వ్యర్థ వ్యవస్థ మీద విపక్షాల, కుహనా మేధావుల, ఉదారవాదుల చర్చతో ఈ దేశం దాదాపు 30 ఏళ్ల విలువైన వర్తమానాన్ని కోల్పోయింది. అయినా ఎవరు వాస్తవంగా సెక్యులరిజానికి వ్యతిరేకులో, తాము వ్యతిరేకులమేనని బాహాటంగా చెప్పుకుంటున్నారో వారికి వాస్తవాలు వివరించే దమ్ము ఈ పిరికి సెక్యులర్ పార్టీలకు లేదు. వెన్నెముక లేని రాజకీయ పార్టీలకు ఏనాడూ ఈ ధైర్యం లేదు. ప్రపంచమంతటా సెక్యులర్, ఉదారవాద వ్యాధిగ్రస్థులది ఇదే సరళి. సెక్యులరిజం భూతంతో జాగ ృత హిందూ శక్తులను ఎదుర్కొనడం సాధ్యం కాదు. హిందూ సంస్థలను నిరోధించడం,నిర్మూలించడం అసలే సాధ్యం కాదు

## సియోల్‌లో మాపో రిసోర్స్ రికవరీ ప్లాంట్‌ను సందర్శించిన తెలంగాణ మంత్రుల బృందం

మొదటి పేజీ తరువాయి

దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో తెలంగాణ మంత్రులు, అధికారుల బృందం పర్యటిస్తోంది. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు ఈ బృందంలో ఉన్నారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో తెలంగాణ మంత్రులు, అధికారుల బృందం పర్యటిస్తోంది. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, పలువురు ఎమ్మెల్యేలు, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్, జీహెచ్ఎంసీ, మూసీ రివర్‌ఫ్రంట్ అధికారులు ఈ బృందంలో ఉన్నారు. సియోల్‌లో చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసే మాపో రిసోర్స్ రికవరీ ప్లాంట్‌ను ఈ బృందం సందర్శించింది.మాపో ప్లాంట్‌లో రోజుకు వెయ్యి టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. వ్యర్థాల రీసైక్లింగ్‌కు వేస్ట్ టు ఎనర్జీ టెక్నాలజీని సియోల్ నగరపాలక సంస్థ వాడుతోంది. పర్యావరణంపై దుష్ప్రభావం పడకుండా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. మరో 10 ఏళ్లలో పూర్తిగా భూ ఉపరితలం నుంచి తొలగించి భూగర్భంలో అతిపెద్ద ప్లాంట్‌ను నిర్మించేందుకు సియోల్ నగర పాలక సంస్థ ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మాపో ప్లాంట్ పనితీరును అధ్యయనం చేసేందుకు తెలంగాణ మంత్రుల బృందం వెళ్లింది.
ఈ సందర్భంగా దానకిషోర్ మాట్లాడుతూ సియోల్, హైదరాబాద్ నగర నమూనాలు ఒకేలా ఉంటాయని తెలిపారు. సియోల్‌లో సుమారు 10వేల మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించి నగరంలోని నాలుగు వైపులకు తరలిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో దాదాపు 8వేల మెట్రిక్ టన్నులు సేకరించి ఒకే వైపునకు తీసుకెళ్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నగరం చుట్టూ నాలుగు ప్రదేశాలను గుర్తించినట్లు వివరించారు. నగరంలోని చెత్తను నాలుగు వైపులకు పంపించడం ద్వారా రవాణా ఖర్చులు తగ్గుతాయన్నారు. హైదరాబాద్ నగరం, తెలంగాణ ప్రజల భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మూసీ నదిని ప్రక్షాళన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సియోల్‌లో చెయోంగ్ గయ్ చియోన్ నదిని ఆయన పరిశీలించారు.

## భారత సంతతి ఓటర్లూ కీలకమే!



అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో భారతీయ అమెరికన్ల ఓట్లు కీలకంగా మారాయి. సంఖ్యాపరంగా చూస్తే ఓటర్లు తక్కువగానే ఉన్నప్పటికీ, నానాటికీ భారతీయ అమెరికన్ల ప్రభావం పెరుగుతుండటంవల్ల వారిని విస్మరించే పరిస్థితి లేదు. అందుకే రెండు ప్రధాన పార్టీలు వీరి ఓట్లను దక్కించుకునేందుకు ప్రత్యేక ప్రణాళికలు వేస్తున్నాయి. అమెరికా రాజకీయాల్లో భారతీయ మూలాలున్నవారు కీలక పాత్ర పోషిస్తున్నారు. కేవలం ఓటర్లుగానే కాకుండా రాజకీయ నేతలుగా, అభ్యర్థులుగా, ఓటర్లను సమీకరించే శక్తులుగా, నిధులు సేకరించే వారిగా ఇలా అనేక అంశాల్లో భారతీయులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. అమెరికా మొత్తం ఓటర్లలో భారతీయ అమెరికన్ల ఓట్లు దాదాపు 21 లక్షలుంటాయి. అధ్యక్ష ఎన్నికను మలుపు తిప్పగల సామర్థ్యమున్న స్వింగ్ రాష్ట్రాల్లో భారతీయుల జనాభా ఎక్కువగా ఉంది. స్వింగ్ స్టేట్స్‌గా పిలిచే పెన్సిల్వేనియా, ఆరిజోనా, నెవడా, జార్జియా, మిషిగన్, నార్త్ కరోలినా, విస్కాన్సిన్ రాష్ట్రాల్లో ఉన్న దక్షిణాసియా ఓటర్లలో ఇండియన్లు అత్యధికంగా ఉన్నారు. అధ్యక్ష ఎన్నికల ఫలితాన్ని తేల్చడంలో అత్యంత కీలకమైన పెన్సిల్వేనియా రాష్ట్రంలోని బక్స్ కౌంటీలో భారతీయులు అధిక సంఖ్యలో ఉన్నారు. మిషిగన్, జార్జియా రాష్ట్రాల్లోనూ భారతీయ సంతతి అధికంగా ఉంది.

### భారీ స్థాయిలో విరాళాలు

అమెరికాలో ప్రధాన పార్టీలకు భారతీయ అమెరికన్ల నుంచి పెద్ద మొత్తంలో విరాళాలు అందుతున్నాయి. అక్కడ భారతీయ అమెరికన్ల సగటు వార్షిక ఆదాయం 1.45 లక్షల డాలర్లుగా ఉంది. ఇది అమెరికన్లతో పోలిస్తే 21 శాతం ఎక్కువ. హారిస్‌కు కాలిఫోర్నియాలో ఇటీవల ఒక్క వారంలోనే ఏకంగా 5.5 కోట్ల డాలర్ల విరాళాలు వచ్చాయి. వాటిలో ఎక్కువ మొత్తం భారతీయ అమెరికన్ల నుంచే వచ్చాయి. డెమొక్రటిక్ పార్టీకి భారీగా విరాళాలిచ్చిన జాబితాలో 60 మందికిపైగా ఇండియన్ అమెరికన్లు ఉన్నారు. అక్కడ రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్న భారతీయుల సంఖ్య పెరుగుతోంది. సెనేట్, ప్రతినిధుల సభతో పాటు రాష్ట్రాల సెనేట్లు, అసెంబ్లీలు, సిటీ కౌన్సిళ్లు, స్కూలు బోర్డులకు ప్రాతినిధ్యం వహిస్తున్న, జిల్లాల అటార్నీలుగా నియమితులవుతున్న భారతీయ మూలాలున్నవారి సంఖ్య పెరుగుతోంది.

### సర్వేలు ఏం చెబుతున్నాయి?

స్వింగ్ రాష్ట్రాల్లో హారిస్, ట్రంప్ విజయావకాశాలను భారతీయ ఓటర్లు ప్రభావితం చేసే అవకాశం ఉందని సర్వేలు అంటున్నాయి. అమెరికాలో దక్షిణాసియాకు చెందిన 48 లక్షల మందికిపైగా యువ ఓటర్లను ప్రభావిత చేయడంలో భారతీయులు కీలకంగా మారినట్లు వెల్లడించాయి. గత రెండు అధ్యక్ష ఎన్నికల్లోనూ భారతీయ అమెరికన్లు భారీ సంఖ్యలో ఓటేసినట్లు ఎగ్జిట్ పోల్స్ తెలిపాయి. 2020 ఎన్నికల్లో 71 శాతం ఇండో అమెరిన్లు ఓటేసినట్లు చెప్పాయి. ఈసారి 91 శాతం మంది ఓటు వేసే అవకాశాలు ఉన్నాయని ఆసియన్ అమెరికన్ ఓటర్ సర్వే అంచనా వేసింది.

### భారతీయ అమెరికన్ల మద్దతు ఎవరికి?

భారతీయ అమెరికన్లలో దాదాపు 55 శాతం మంది డెమొక్రటిక్ పార్టీ మద్దతిస్తున్నట్లు తాజా సర్వేలు వెల్లడించాయి. 25 శాతం మంది రిపబ్లికన్ పార్టీకి మద్దతిచ్చారు. 15 శాతం మంది స్వతంత్రులకు మద్దతివ్వగా, మిగిలిన వారు తమ అభిప్రాయాన్ని చెప్పేందుకు విముఖత చూపినట్లు సర్వేలు తెలిపాయి.

## భారత్ లౌకిక దేశంగా ఉండాలనుకోవడంలేదా?: పిటిషనర్‌కు సుప్రీం ప్రశ్న



రాజ్యాంగంలో 42వ సవరణపై నేడు సుప్రీం కోర్టులో పిటిషనర్లు వాదనలు వినిపించారు. ఒక దశలో న్యాయవాదులపై ధర్మాసనం ప్రశ్నలు సంధించింది. సోషలిస్ట్ (సామ్యవాద), సెక్యులర్ (లౌకిక) పదాలు రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలోనే కీలకమైనవని ఇప్పటికే ఎన్నో తీర్పులు నొక్కిచెప్పాయని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. రాజ్యాంగ పీఠిక నుంచి ఈ పదాలను తొలగించాలని కోరుతూ భాజపా నేత సుబ్రహ్మణ్య స్వామి తదితరులు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై నేడు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది.పిటిషనర్, న్యాయవాది విష్ణు శంకర్ జైన్ తన వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగానికి 1976లో చేపట్టిన 42వ సవరణపై పార్లమెంట్‌లో చర్చే జరగలేదన్నారు. దీనిపై జస్టిస్ ఖన్నా స్పందిస్తూ.. ఈ పదాలకు వివిధ వివరణలున్నాయని.. వేర్వేరుగా అన్వయించుకుంటున్నారని పేర్కొన్నారు. అదే సమయంలో కోర్టులు పలుమార్లు ఇవి రాజ్యాంగంలోని ప్రాథమిక భాగాలుగా అభివర్ణించినట్లు వెల్లడించారు."సోషలిజం అంటే.. అందరికీ సమాన అవకాశాలు ఉండాలని. సమానత్వం అనే అంశాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. మీరు దీనిని మరో రకంగా చూడకూడదు. అప్పుడు వేరే అర్థం కూడా వస్తుంది. ఇక సెక్యులర్ అనే పదం కూడా అంతే" అని ఖన్నా వ్యాఖ్యానించారు.మరో న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ తన వాదనలు వినిపిస్తూ.. ఈ సవరణ అమల్లోకి వచ్చేనాటికి అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించిన విషయాన్ని గుర్తుచేశారు. దీనిపై న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా స్పందిస్తూ "మీరు భారత్ లౌకిక దేశంగా ఉండాలనుకోవడంలేదా..?" అని సూటిగా ప్రశ్నించారు. దీనిపై అడ్వకేట్ జైన్ బదులిస్తూ "భారత్ లౌకిక దేశంగా ఉండకూడదని మేము అనడంలేదు. ఆ సవరణను మాత్రమే సవాలు చేశాం" అని పేర్కొన్నారు. పీఠికలో ఈ రెండు పదాలు చేర్చడం వల్ల పాండోరా బాక్స్‌ను తెరిచినట్లైందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ప్రజాస్వామ్యం అనే పదాన్ని కూడా తొలగించవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.ఇక భాజపా నేత సుబ్రహ్మణ్య స్వామి తన వాదనలు వినిపిస్తూ.. పీఠికలో 26 నవంబర్ 1949 తేదీ ఉండటం తప్పని నిరూపిస్తానని పేర్కొన్నారు. " మనకు రాజ్యాంగ పీఠిక రెండు భాగాలుగా ఉండొచ్చు. కానీ, సెక్యులరిజం, సోషలిజం పదాలు చేర్చడానికి భారత ప్రజలు అంగీకరించారని చెప్పడం సరికాదు. పీఠిక రెండు భాగాల్లో ఒక దానిని తేదీతో, మరో దానికి డేట్ లేకుండా ఉంచవచ్చు" అని పేర్కొన్నారు. దీనిపై జస్టిస్ ఖన్నా స్పందిస్తూ.. పిటిషనర్లు సంబంధిత పత్రాలను సమర్పిస్తే పరిశీలిస్తామని చెప్పారు. నోటీసులు జారీ చేయడానికి మాత్రం బెంచ్ అంగీకరించలేదు. తదుపరి వాదనలను నవంబర్ 18వ తేదీన వింటామని న్యాయమూర్తులు పేర్కొన్నారు.

## ఉగ్రవాదంపై యుద్ధం ఇంకా ముగియలేదు: అమిత్ షా

మొదటి పేజీ తరువాయి

పాల్గొని ప్రసంగించారు.దేశంలో ఉగ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలనే సంకల్పంతో తమ ప్రభుత్వం పని చేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. దిల్లీలో జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కార్యకలాపాలను అణచివేయడానికి భారత బలగాలు గత పదేళ్లుగా శాయశక్తులా కృషి చేస్తున్నాయని.. అయినప్పటికీ ఉగ్రవాదంపై యుద్ధం ఇంకా ముగియలేదన్నారు. డ్రగ్స్, భారత వ్యతిరేక చర్యలు, ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టడానికి ఎన్డీఏ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు.. వారి త్యాగాల వల్లే దేశం సురక్షితంగా ఉందని అమిత్ షా అన్నారు. గత ఏడాది కాలంలో దాదాపు 216 మంది పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. వీరి త్యాగాలను దేశం ఎప్పటికీ మరిచిపోదన్నారు. "మా పదేళ్ల పాలనలో జమ్ము కశ్మీర్, వామపక్ష అతివాద ప్రభావిత ప్రాంతాల్లో శాంతి నెలకొంది. అయినా మా పోరాటాన్ని ఆపం. కశ్మీర్‌లో మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, మతపరమైన ఉద్రిక్తతలను సృష్టించే కుట్రలు, చొరబాట్లకు పాల్పడుతున్న ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటాము" అని షా అన్నారు.విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు అమిత్ షా నివాళులర్పించారు.

# కబ్జాదారుల నుండి బ్రహ్మాణికుంట చెరువు శిఖం భూమిని కాపాడాలి.

**– కబ్జాదాలకు సహకరించిన ఇరిగేషన్ శాఖ ఏఈ రఘురామ్ , డిఈ రూపులను సస్పెండ్ చేయాలి**



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 21**
కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి పట్టణ కేంద్రంలో బ్రాహ్మణకుంట కుంట (చెరువు) శిఖం భూమి చెరువు శిఖంలో 6 ఎకరాల భూమిని పట్టా చేసుకోవడానికి, 4 ఎకరాలు రియల్ ఎస్టేట్ చేసుకోవడానికి అన్ని రకాలుగా కబ్జాచేసుకోవడానికి సహకారం చేసిన ఇరిగేషన్ శాఖ ఏఈ రఘురాం డిఈ రూపులపై సమగ్ర ఎంక్వయిరీ చేసి సస్పెండ్ చేయాలనీ, కబ్జాకు గురైన భూమిని కాపాడాలని, రి సర్వే నిర్వహించి అన్ని రకాల ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్ నిర్ణయించి హద్దులు పెట్టాలని అప్పటి వరకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేసేయ్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేసేయ్: బ్రాహ్మణ కుంట చెరువు పై రెండు రోజుల్లో సమగ్రంగా ఎంక్వయిరీ చేసి రిపోర్ట్ ఇవ్వాలని జిల్లా ఇరిగేషన్ ఆఫీసర్ కి ఆదేశాలు జారీ చేయడం జరిగినది.ఈ సందర్భంగా అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ బ్రహ్మణి కుంట చెరువు శిఖం భూమిని కాపాడాలని అనేకసార్లు అధికార్లకు ఫిర్యాదు చేసిన పెడచెవిన పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేరుకే ప్రజావాణి తప్ప రెవిన్యూ సమస్యలపై ఇచ్చిన ఏ ఒక్కటి పరిస్కారం కావడం లేదని అన్నారు. బ్రాహ్మణి కుంట చెరువు శిఖం భూమికి ఎఫ్టిఎల్, బఫర్ జోన్ పై తప్పుడు రిపోర్టులు, హద్దులు నిర్ణయించిన ఇరిగేషన్ మరియు రెవెన్యూ అధికారులు నీటిపారుదల శాఖ అధికారులు ఎంక్వైరీ కోసం పోయి రియల్ ఎస్టేట్ వారితో, కబ్జాదారులతో కలిసి చెరువు సీకం భూమిని పరిశీల చేయడం అనేది ఎంతవరకు కరెక్టో ప్రజలు, మేధావులు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. బ్రాహ్మణకుంట శిఖం భూమి పక్కనే పట్టా భూమి 301ని చూపుతూ దీని పక్కనే బ్రాహ్మణకుంట శిఖం భూమి సర్వేనెంబరు 300 లో ప్లాట్ల విక్రయాలను జరుపుతున్నారని నీటిపారుదల శాఖ డిఈ, ఈఈ రిపోర్టులు ఇవ్వడం ద్వారా కబ్జాదారులు రియల్ ఎస్టేట్ చేసుకోవడానికి చెరువు శిఖం భూమిని కబ్జాలు చేసి రియల్ ఎస్టేట్ గా మార్చి ప్లాట్ లు అమ్ముకుంటున్నారని అన్నారు. మరొకరు ఆరు ఎకరాలు పట్టా చేసుకున్నారని అన్నారు. ఇంత జరుగుతున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు ఉండటం సిగ్గుచేటని విమర్శించారు. వీటన్నింటికీ సహకరించిన నీటిపారుల శాఖ కొత్తపల్లి డివిజన్ ఏఈ రఘురామ్, డీఈ రూపుల లపై సమగ్ర ఎంక్వయిరీ చేసి సస్పెండ్ చేయాలనీ డిమాండ్ చేశారు. చెరువు శిఖం భూమిని కబ్జాలా నుండి కాపాడాలని పిర్యాదు చేస్తే లకు పిర్యాదు చేసిన పట్టించుకోకుండా రియల్ ఎస్టేట్ మాఫియా చేస్తున్న కబ్జాదారులతో కుమ్మక్కై ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్ చెరువు శిఖంలోనే నిర్ణయించడం సిగ్గుచేటని విమర్శించారు. దీనితో పక్కనే ఉన్న సర్వే నెంబర్ 301 మరియు ఇతర సర్వే నెంబర్ల యజమానులు చెరువు శిఖం భూమిని దాదాపు నాలుగెకరాలు భూమిని కబ్జా చేసి పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ చేస్తున్నారు. కుంట శిఖం భూమిలో కొంత మందికి ఆరు ఎకరాల పట్టా ఇవ్వడం అనేది దుర్మార్గమని అన్నారు. ఇచ్చిన దొంగ పట్టల పై సమగ్ర విచారణ చేసి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ సుధాకర్ రెడ్డి, ఎస్ఈ అశోక్ కుమార్ గారికి ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. దీనిపై ఎంక్వైరీ చేయడం లేదని అన్నారు. చొప్పదండి పట్టణంలోని బ్రాహ్మణకుంట కుంట శిఖం భూమికి రీ సర్వే నిర్వహించి కుంట శిఖానికి హద్దులు నిర్ణయించి, ఎఫ్ టి ఎల్. బఫర్ జోన్ హద్దులు నిర్ణయించాలని, చెరువు శిఖం భూముల ఎవరైనా నిర్మాణాలు చేస్తే ఆ నిర్మాణాలను కూల్చివేయాలని, బ్రాహ్మణి కుంట చెరువు శిఖం భూమి కబ్జాకుల నుండి కాపాడాలని, భవిష్యత్ తరాలకు చెరువు ఉపయోగపడేవిధంగా చూడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జి. ప్రశాంత్ కుమార్, బద్రి నేత పాల్గొన్నారు.

## దళితబంధు సాధన సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతిపత్రం





**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 21**
కరీంనగర్ ప్రజావాణి కార్యక్రమనికి హుజురాబాద్ నియోజకవర్గం నుండి సుమారుగా 200మంది బాధితులు రావడం జరిగింది దళితబంధు రెండవ విడత పై కాంగ్రెస్ ప్రభుత్వం గత 10నెలల నుండి ఇప్పటివరకు ఏలాంటి స్పష్టత ఇవ్వకుండా దళితులను చిన్నచూపు చూస్తుందని హుజురాబాద్ నియోజకవర్గంలో సుమారుగా 4900పై చిలుకు బాధితులు ఉన్నారు రెండవ విడతపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోవడం వాళ్ళ చాలామంది రోడ్డున పడే అవకాశం ఉందని వాపోయారు కావున ఈ నెల 26వ తేదీన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే క్యాబినెట్ సమావేశంలో దళితబంధు రందవ విడత నిధులపై స్పష్టమైన ప్రకటన చేసేలాగా జిల్లా కలెక్టర్ అధికారుల దృష్టికి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ప్రజావాణి లో వినతిపత్రం అందించడం జరిగింది
క్యాబినెట్ సమావేశంలో దళితబంద్ పై ప్రకటన చేయకుంటే రానున్న రోజుల్లో రాష్ట్రంలో ఉన్న దళితులందరిని ఏకం చేసి సచివాలయం ముట్టడి చేయడానికి దళితులు అంత సిద్ధంగా ఉన్నారని ప్రభుత్వనికి హెచ్చరికలు జరిచేయడం జరిగింది ఈ కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి సభ్యులు మరియు నియోజకవర్గంలోని బాధితులు పాల్గొన్నారు

## జిన్నారం జంగంపేట గ్రామాల రైతులు నాయకులు తహసిల్దార్ కు వినతి పత్రం అందజేత

– అసైని రైతులకు అసైన్ భూములను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పట్టాలు ఇవ్వాలి
– జిన్నారం జంగంపేట గ్రామాల అసైని రైతుల పక్షాన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన
– జి. వెంకటేశం గౌడ్ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సారథి. బి.ఆర్.ఎస్. రాష్ట్ర నాయకులు
– కోలాన్ బాల్ రెడ్డి మాజీ మండల అధ్యక్షులు బి.ఆర్.ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు
– గోవర్ధన్ రెడ్డి బి.ఆర్.ఎస్. రాష్ట్ర నాయకులు



**కరపత్రం దినపత్రిక సంగారెడ్డి మెదక్ జిల్లా ప్రతినిధి.**
సంగారెడ్డి జిల్లా జిన్నారం జంగంపేట గ్రామాల రైతులు గత ప్రభుత్వంలో సర్వే నంబర్ 1001, సర్వే నంబర్ 376, గల భూములను హెచ్ఎండిఏ కు కేటాయించగా నష్టపరిహారం కింద ఒక ఎకరాకు 600 గజాలను కేటాయింపు చేస్తామని గతంలో హామీ ఇచ్చిన మేరకు కేటాయించాలని లేని పక్షంలో యధావిధిగా రైతుల భూములను తిరిగి ప్రభుత్వం



హామీ ఇచ్చిన మేరకు రైతులకు అసైన్ భూమిని పట్టా చేసి ఇవ్వాలని సోమవారం జి. వెంకటేశం గౌడ్ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సారధి బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు ,మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోవర్ధన్ రెడ్డి, జిన్నారం తహశీల్దార్ కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసైన్ రైతులకు తక్షణమే పట్టాలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అసైన్ రైతుల తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని అన్నారు ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహ రెడ్డి,శ్రీనివాస్ గౌడ్ ,బ్రహ్మేందర్ గౌడ్ ,నీలం మోహన్,గోవర్ధన్ రెడ్డి,మహేష్, తోట నర్సింగరావు గోకర్ శ్రీధర్ గౌడ్, బండి శ్రీకాంత్ గౌడ్, దోమదుగు ఈరమేష్,ఈదిగాని మల్లేష్, జిన్నారం రాము,రాజ్ కుమార్, అనిల్, గోకరి నిఖిల్ గౌడ్,వికాస్,నాని,గంగా రెడ్డి,పవన్ రైతులు మ్యాదరి విట్టల్ ,దుర్గయ్య , పెంటయ్య ,భాస్కర్, రాములు ,సత్తయ్య ,నరసింహులు, రమేష్ ,నీలమ్మ ,బాలమ్మ, యాదమ్మ ,తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వివేకానంద్ కు పుట్టినరోజు



**కిరణ్ చిట్యాల కరపత్రం ప్రతినిధి కుత్బుల్లాపూర్**
కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ పుట్టినరోజు సందర్బంగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, మేడ్చల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్, మేడ్చల్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భాస్కర్ యాదవ్ లు వివేకానంద్ కు జన్మధిన శుభాకాంక్షలు తెలిపారు. వివేకానంద్ నివాసానికి తరలివెల్లిన నాయకులు వివేకానంద్ ను శాలువాతో సన్మానించి పుష్ప గుచ్చం అందజేసి కేక్ కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## కల్లుపల్లె డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో పట్నం తుమ్మలు...

# శిధిలమవుతున్న నిర్మాణాలు...

**అధికారుల నిర్లక్ష్యంతో పూర్తికాని పేదల గృహ నిర్మాణాలు..**

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, అక్టోబర్ 21.**
వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి ( కల్లు పల్లె)గ్రామంలో పేదల గృహ సముదాయాలైన, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు గత పాలకులు లక్ష్యంతో , ప్రస్తుతం అసంపూర్తిగా నిర్మించిన ఇండ్లలో సర్కారు తుమ్మలు ఏపుగా పెరిగి, అడవిని తలపిస్తున్నాయి. మండలంలోని పేదల నివాసయోగ్యమైన గృహ సముదాయాలైన డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మాణం, కోర్కల్, పోతిరెడ్డిపల్లి లో గత ప్రభుత్వం ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయకుండా, సగంలోనే వదిలేయడంతో పేద ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.కోర్కల్లో కొంతవరకు ఇండ్ల నిర్మాణం






పూర్తయినప్పటికీ ఇప్పుడు వరకు పేద ప్రజలకు ఇవ్వలేదు.పోతిరెడ్డిపల్లి లో మాత్రం ఇండ్ల నిర్మాణం గోడలకే పరిమితమై, గోడలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయని, ఇల్లు పరిసర ప్రాంతాలు చెట్లతో దట్టమైన సర్కార్ తుమ్మల తో భయానక వాతావరణం కనబడుతుంది. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తయితే , ప్రభుత్వం పేదలకు ఇల్లు ఇస్తుందని ఆశతో కోర్కల్, పోతిరెడ్డిపల్లి గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పేరిట మొదటగా స్థలం ఉన్న వారికి ప్రాముఖ్యతను ఇవ్వనుండగా, భూమి లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ప్రాముఖ్యతను ఇచ్చి, యుద్ధ ప్రతిపాదికన, డబుల్ బెడ్ రూమ్ లను నిర్మించి పేదలకు పంచాలని, ప్రజా ప్రతినిధులను,అధికారులను కోర్కల్, పోతిరెడ్డిపల్లి గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

## తిరుమల కొండపై మరోసారి హెలికాప్టర్ కలకలం

**కరపత్రం ప్రతినిధి తిరుపతి జిల్లా: అక్టోబర్21**
తిరుమల శ్రీవారి కొండపై మరోసారి హెలికాప్టర్లు చెక్కలు కొట్టడం కలకలం రేపింది, ఈరోజు ఉదయం స్వామివారి స్వామివారి ఆలయ గోపురానికి దగ్గరగా హెలికాప్టర్ వెళ్ళింది, కొందరు భక్తులు గమనించి తమ మొబైల్ లో రికార్డు చేశారు. మరికొందరు భక్తులు టీటీడీ విజిలెన్స్ సిబ్బందికి ఫిర్యా దు చేశారు. హెలికాప్టర్ ఎక్కడి నుంచి వచ్చిందో అధికారులు ఆరాతీస్తు న్నారు. తిరుమల కొండపై సోమవారం ఉదయం హెలికాప్టర్ వెళ్లడం కలకలం రేపుతోంది. శ్రీవారి ఆలయం



పరిసర ప్రాంతాలను నో ఫ్లైజోన్ గా ప్రకటించారు. కానీ తరచుగా తిరుమల కొండ మీదుగా విమానాలు, హెలికాప్టర్లు చక్కర్లు కొడుతున్నాయి. ఈ హెలికాప్టర్ ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తుందనే విషయాలపై టీటీడీ అధికారులు ఆరా తీస్తున్నారు. నో ఫ్లై జోన్ గా ఉన్న తిరుమల కొండపై హెలికాప్టర్ ఎలా వెళ్లిందనే విషయమై అధికారులు ఏవియేషన్ అధికారులతో మాట్లాడుతున్నారు. ఆగమశాస్త్ర నిబంధనల మేరకు తిరుమల కొండపై నుంచిహెలికాప్టర్ వెళ్లకూడదు. తిరుమల శ్రీవారి కొండ పైన సంచరించింది ఎవరన్నది తెలియవలసింది..

# కోలీవుడ్ పొంగల్ దంగల్!



సంక్రాంతి తెలుగు చిత్రసీమకే కాదు.. తమిళ పరిశ్రమకూ పెద్ద పండగే. ఈ పొంగల్ బరిలో ఇద్దరు ముగ్గురు తమిళ అగ్రతారల చిత్రాలు పోటీ పడటం ఏటా కనిపించే ఆనవాయితీనే. అలాగే వీటిలో సింహభాగం తెలుగులోనూ అనువాదాలుగా అదృష్టం పరీక్షించుకోవడమూ పరిపాటే. అందుకే తెలుగు సినీప్రియులూ కోలీవుడ్ పొంగల్ రేసును ఆసక్తిగా గమనిస్తుంటారు. అయితే ఇప్పుడిప్పుడే తెలుగు సంక్రాంతి రేసుపై స్పష్టత వస్తుండగా.. కోలీవుడ్‌లో మాత్రం పొంగల్ పందెంపై ఇంకా సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. దీంతో ఈసారి పండగ బరిలో వినోదాలు పంచే తారలెవరన్నది అటు కోలీవుడ్ సినీప్రియుల్లోనూ.. ఇటు తెలుగు ప్రేక్షకుల్లోనూ ఆసక్తిరేకెత్తిస్తోంది.

తమిళ చిత్రసీమ నుంచి పొంగల్ బరిలో నిలిచే చిత్రాలేవన్నది ఇంత వరకు స్పష్టత రానప్పటికీ.. ఈసారి ముగ్గురు అగ్రతారల మధ్య ముక్కోణపు పోటీ కనిపించడం ఖాయంగా కనిపిస్తోంది. తమిళ అగ్ర కథానాయకుడు అజిత్‌కు పొంగల్ బాగా అచ్చొచ్చిన సీజన్. ఆయన నుంచి వచ్చిన 'తునీవు', 'విశ్వాసం', 'వీరం' తదితర చిత్రాలన్నీ ఈ పండగ బరిలో మంచి ఆదరణ దక్కించుకున్నాయి. భారీ వసూళ్లు సాధించి సత్తా చాటాయి. దీంతో ఇప్పుడాయన మరోసారి పొంగల్ బరిలో అదృష్టం పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

ప్రస్తుతం అజిత్ చేతిలో 'విదాముయార్చి'తో పాటు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రాలున్నాయి. ఈ రెండు యాక్షన్ ఎంటర్‌టైనర్లలో తిరుమేని తెరకెక్కించిన 'విదాముయార్చి' ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకోగా.. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్న 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ముగింపు దశలో ఉంది. అయితే వీటిలో అజిత్ – రవిచంద్రన్‌ల సినిమాని పొంగల్ బరిలో నిలపనున్నట్లు ఆ చిత్ర బృందం గతంలోనే ప్రకటించింది. కాకపోతే డిసెంబరు నాటికి ఈ చిత్రం సిద్ధమయ్యే దాన్ని బట్టి విడుదల తేదీపై స్పష్టత వచ్చే అవకాశముంది. అందుకే మరోవైపు 'విదాముయార్చి'ని కూడా పండగ లక్ష్యంగానే చకచకా నిర్మాణానంతర పనులు పూర్తి చేస్తోంది ఆ చిత్ర బృందం. మరి ఈ రెండింటిలో ఏది ముందొస్తుందన్నది ఇప్పటికి తేలకున్నా.. పొంగల్ రేసులో అజిత్ కనిపించడం పక్కా అని అర్థమవుతోంది.

### యాక్షన్ థ్రిల్లర్‌గా...

ఇటీవలే 'తంగలాన్'తో భారీ విజయాన్ని అందుకుని జోరుమీదున్నారు కథానాయకుడు



విక్రమ్. ఇప్పుడాయన పొంగల్ బరిలో అజిత్‌తో తలపడనున్నట్లు కోలీవుడ్ వర్గాల సమాచారం. ప్రస్తుతం ఆయన నుంచి రానున్న కొత్త చిత్రం 'వీర ధీర శూరన్: పార్ట్ 2'. 'చిన్నా' సినిమాతో ప్రేక్షకుల్ని మెప్పించిన ఎస్.యు.అరుణ్ కుమార్ దీన్ని తెరకెక్కిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ చిత్రం ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. దీన్ని ముగ్గుల పండగ బరిలో అజిత్ సినిమాకి ఒకరోజు అటుఇటుగా విడుదల చేసేందుకు చిత్ర నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం వినిపిస్తోంది.

ఇక ఈ పండగ రేసులోనే అజిత్, విక్రమ్‌లకు తోడుగా కథానాయకుడు కార్తి కూడా సందడి చేసే అవకాశమున్నట్లు కోలీవుడ్ నుంచి సమాచారం అందుతోంది. ప్రస్తుతం ఆయన హీరోగా నలన్ కుమారస్వామి తెరకెక్కించిన చిత్రం 'వా వాతియారే'. కె.ఇ.జ్ఞానవేల్ రాజా నిర్మించారు. యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉంది. నవంబరు నాటికి దీన్ని పూర్తిగా సిద్ధం చేసి విడుదల తేదీపై స్పష్టత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. 'సత్యం సుందరం' విజయం తర్వాత కార్తి నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపైనా ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

### కమల్ సందడి ఓటీటీలో?

కథానాయకుడు కమల్‌హాసన్.. దర్శకుడు శంకర్ కలయికలో రూపొందిన చిత్రం 'భారతీయుడు 2'. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ ముందు చేదు ఫలితాన్ని అందుకుంది. ఈ నేపథ్యంలో ఆ సినిమాకి కొనసాగింపుగా సిద్ధం చేసిన 'భారతీయుడు 3' థియేట్రికల్ విడుదలపై అనుమానాలు నెలకొన్నాయి. ప్రస్తుతం దీన్ని నేరుగా ఓ ప్రముఖ ఓటీటీ వేదికలో విడుదల చేసేందుకు చర్చలు చేస్తున్నట్లు తెలిసింది. అన్నీ అనుకున్నట్లు జరిగితే దీన్ని జనవరిలో సంక్రాంతి సందర్భంగా ఓటీటీలో చూసే అవకాశముందని సమాచారం.

### తెలుగులోకి వచ్చేవెన్ని?

కథానాయకులు అజిత్, విక్రమ్, కార్తిలకు తమిళ చిత్రసీమకు దీటుగా తెలుగులోనూ మంచి మార్కెట్ ఉంది. అందుకే వీరి నుంచి వచ్చే ప్రతి సినిమా తెలుగులోనూ ఒకేసారి విడుదలవుతుంటుంది. అంతేకాదు సంక్రాంతి బరిలోనూ వీరి అనువాదాలు తెలుగు చిత్రాలతో పోటీ పడటం ఏటా చూస్తూనే ఉంటాం. కానీ, ఈసారి ఆ పోటీలో నిలిచేవెన్ని అన్నది ఆసక్తిరేకెత్తిస్తోంది. ఈ ఏడాది పొంగల్ సందర్భంగా తమిళంలో ధనుష్ 'కెప్టెన్ మిల్లర్', శివ కార్తికేయన్ 'అయలాన్', విజయ్ సేతుపతి 'మేరీ క్రిస్మస్' తదితర చిత్రాలు బాక్సాఫీస్ ముందు అదృష్టం పరీక్షించుకున్నాయి. వీటిలో ధనుష్, శివ కార్తికేయన్‌ల సినిమాల్ని తెలుగులోనూ విడుదల చేయడానికి ప్రయత్నించినప్పటికీ అప్పటికే తెలుగులోని సంక్రాంతి చిత్రాల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. వాటిని రెండు వారాలు ఆలస్యంగా తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ప్రస్తుతం తెలుగులో మరోసారి అదే రీతిలో సంక్రాంతి చిత్రాల పోటీ కనిపిస్తోంది. రామ్‌చరణ్, బాలకృష్ణ, వెంకటేశ్ తదితరుల చిత్రాలు పండగ బరిలో తలపడటం దాదాపుగా ఖాయమైంది. నాగచైతన్య, సందీప్ కిషన్ తదితరులు ఈ రేసులో కనిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. మరి ఇంత రద్దీ నేపథ్యంలో ఈసారైనా అనువాద చిత్రాలకు తెలుగులో థియేటర్లు దొరికే అవకాశముందా? లేక ఈ ఏడాది పరిస్థితే పునరావృతమవుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## యుద్ధభూమిలో మళ్లీ పోరు షురూ



హృతిక్ రోషన్‌తో కలిసి మరోసారి యుద్ధభూమిలోకి అడుగు పెట్టేందుకు సిద్ధమయ్యారు కథానాయకుడు ఎన్టీఆర్. ప్రస్తుతం వీళ్లిద్దరి కలయికలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్నారు. యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా ప్రస్తుతం కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకునేందుకు సిద్ధమైంది. అది ఈ వారం నుంచే ముంబయిలో మొదలు కానుంది. దీనికోసం ఎన్టీఆర్ ఇప్పటికే అక్కడికి చేరుకున్నారు. ఈ షెడ్యూల్‌లో హృతిక్ – తారక్‌లపై ఓ భారీ ఛేజింగ్ సీక్వెన్స్‌తో పాటు పాటను చిత్రీకరించనున్నట్లు సమాచారం. ఇందుకోసం ప్రత్యేకంగా కొన్ని సెట్లు సిద్ధం చేయించినట్లు తెలిసింది. అందులోనే ప్రధాన తారాగణంపై చిత్రీకరణ కొనసాగించనున్నారు. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.



# ఆ విషయంలో భయం..
# అందుకే హిందీ మాట్లాడను: సమంత

సమంత, వరుణ్ ధావన్ ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ'. అమెజాన్ ప్రైమ్ వేదికగా నవంబర్ 7 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈనేపథ్యంలో టీమ్ వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ సిరీస్‌పై ఆసక్తిని పెంచుతోంది. తాజాగా నటీనటులతో పాటు సిరీస్ దర్శకులు రాజ్ అండ్ డీకే ఓ ఆంగ్ల మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సిరీస్‌లో కథానాయికగా మొదట సమంతను అనుకోలేదని దర్శకుడు అన్నారు."ది ఫ్యామిలీ మ్యాన్–2' చిత్రీకరణ సమయంలో సిటాడెల్ స్క్రిప్ట్ దశలోనే ఉంది. అందుకే మేము సమంతకు దీని గురించి చెప్పలేదు. ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాక హీరోగా వరుణ్‌ను ఎంపిక చేశాం. కథానాయికగా ఎవర్ని తీసుకోవాలని ఆలోచించాం. వరుణ్ హిందీ మాట్లాడతాడు కాబట్టి కథానాయిక కూడా హిందీ మాట్లాడేవారైతే బాగుంటుందనుకున్నాం. 'ది ఫ్యామిలీ మ్యాన్–2' సమయంలో సమంత హిందీ మాట్లాడలేదు. అందుకే ఆమెను కాకుండా మరొకరిని తీసుకోవాలనుకున్నాం. అయితే ఒక రోజు సమంత హిందీలో మాట్లాడడం చూసి ఆశ్చర్యపోయాం. అంత స్పష్టంగా ఎలా మాట్లాడిందో అర్థం కాలేదు. వెంటనే ఆమెతోనే సిరీస్ చేయాలని భావించాం" అన్నారు. ఇక ఈ వ్యాఖ్యలపై సమంత స్పందిస్తూ.. 'హనీ(సిటాడెల్‌లో సమంత పాత్ర)కు హిందీ బాగా వచ్చు. ఈ విషయాన్ని మీరు గుర్తించలేకపోయారు. కాకపోతే ఉచ్చారణలో లోపాలుంటాయేమోనన్న భయంతో నేను వేదికపై హిందీలో మాట్లాడను' అన్నారు.

### నా మైండ్‌లోకి వచ్చిన హీరోయిన్ ఆమెనే..

ఇక ఇదే ఇంటర్వ్యూలో వరుణ్ మాట్లాడుతూ సమంతపై ప్రశంసలు కురిపించారు. 'సిటాడెల్' స్క్రిప్ట్ తన వద్దకు రాగానే ఇందులో హీరోయిన్‌గా సమంత అయితే బాగుంటుందని అనుకున్నట్లు చెప్పారు. 'దర్శకులతో దీని గురించి చర్చించినప్పుడు నా మైండ్‌లోకి వచ్చిన మొదటి హీరోయిన్ సమంతనే. ఆమె అయితే ఈ పాత్రకు పూర్తి న్యాయం చేయగలరనిపించింది. ఆమె ఇందులో భాగమైతే ప్రాజెక్ట్ మరింత పెద్దదవుతుందనుకున్నాం. అనుకున్నట్లే ఆమెను ఎంపిక చేశాం. ఇందులో మా ఇద్దరి కెమిస్ట్రీ బాగుంది' అని చెప్పారు.యాక్షన్ థ్రిల్లింగ్ వెబ్‌సిరీస్‌గా 'సిటాడెల్: హనీ బన్నీ' రూపొందింది. ఇందులో సమంత హనీ పాత్రలో కనిపించనున్నారు. ఇటీవల దీని ట్రైలర్ విడుదల చేయగా మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. బాలీవుడ్ ప్రముఖులు కూడా ప్రశంసలు కురిపించారు. సిరీస్ విడుదల కోసం వేచిచూస్తున్నట్లు చెప్పారు.

## జనవరిలో స్కై ఫోర్స్?

'సర్ఫిరా', 'ఖేల్ ఖేల్ మే' చిత్రాలతో ఇటీవలే ప్రేక్షకులను అలరించిన బాలీవుడ్ అగ్ర కథానాయకుడు అక్షయ్ కుమార్. ప్రస్తుతం ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'స్కై ఫోర్స్'. యాక్షన్ డ్రామా నేపథ్యంలో సందీప్ కేవ్లానీ తెరకెక్కిస్తున్నారు. భారత దేశ మొదటి వైమానిక దాడి ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. దినేశ్ విజన్ నిర్మిస్తున్నారు. ఇందులో సారా అలీ ఖాన్, వీర్ పహారియా, నిమ్రత్ కౌర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. "చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ నిర్మాణానంతర పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. క్రిస్మస్‌కు విడుదల కాబోతున్న ఈ సినిమా



ట్రైలర్‌తో ప్రచార కార్యక్రమాల్ని మొదలు పెట్టనుంది చిత్రబృందం. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి 24న విడుదల చేయాలని నిర్ణయించుకుంది చిత్రబృందం" అని అక్షయ్ కుమార్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఈయన 'కన్నప్ప', 'జాలీ ఎల్ఎల్‌బీ 3', 'హౌస్‌ఫుల్ 5' చిత్రాలతో బిజీగా ఉన్నారు.